ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం 18 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm


తామెలా బతకాలి

# మా భూములివ్వం

## సీఎంను కలిసేందుకు వెళ్తే బెదిరింపులు

## ఢిల్లీ జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ కు లగచర్ల బాధితులు ఫిర్యాదు

న్యూఢిల్లీ : మా భూములు ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వమని లగచర్ల బాధితులు స్పష్టం చేశారు. తమ భూములను వదిలేయాలని.. తమ వారిని వదిలేయాలని కోరారు. తమకు ఉన్న మొత్తం భూమిని తీసుకుంటా అంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎప్పుడు పోలీసులు వచ్చి ఏం చేస్తారోనని.. ఇంట్లో ఉండాలంటేనే భయం వేస్తోందని చెప్పారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచకంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తమ ఇంట్లో ఉన్న మగవాళ్లందరినీ తీసుకెళ్లారని... ఎనిమిది రోజులుగా తమ పిల్లలు ఎక్కడున్నారో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 9 నెలలుగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. తమ ప్రాణాలు పోయినా సరే ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని కలిసేందుకు వెళ్తే తమను బెదిరించి పంపించారని చెప్పారు.



కేంద్ర తరఫున

# కమిటీ వేయండి

**రుణమాఫీ వివరాలు తెలుస్తాయి**
**18 వేల కోట్లు మాఫీ చేశాం**
**సీఎం రేవంత్ రెడ్డి**



ముంబై : రుణమాఫీ వివరాలు కావాలంటే కేంద్రం తరఫున కమిటీ ఏర్పాటు చేయండి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్రలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ, బీజేపీ నేతలకు ధైర్యముంటే కేంద్రం తరుఫున కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణకు ఆ కమిటీని పంపించాలన్నారు. తెలంగాణకు రావడానికి డబ్బుల్లేకుంటే నేను విమానం పంపిస్తానన్నారు. 2 లక్షల వరకు రుణం ఉన్న రైతులకు 25 రోజుల్లో 18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. మేం తెలంగాణలో 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇందులో ఒక్క ఉద్యోగం తక్కువైనా నేను కాంగ్రెస్ తరఫున క్షమాపణ చెబుతానన్నారు. రుణమాఫీ హామీ ఇచ్చాం నెరవేరుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీకి ఆయన పలు ప్రశ్నలు సంధించారు.



# సీఎంకు 'ఫార్మా' ముఖ్యమా?

సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల కంటే ఫార్మా కంపెనీ ముఖ్యమా అని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈరోజు సంగారెడ్డి జైలులో లగచర్ల రైతులతో బీజేపీ ఎంపీలు ములాఖత్ అయ్యారు.

సంగారెడ్డి :



రైతులను ఈటల రాజేందర్‌తోపాటు ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడారు.
ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమంటూ.. ఎనిమిది నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నారన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామంటే రైతులు ఆగ్రహించారన్నారు. లగచర్ల ఘటనకు పోలీసుల వైఫల్యమే కారణం అని అన్నారు. ఘటనలో కాంగ్రెస్‌కు చెందినవారిని వదిలేశారన్నారు. లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌కు ప్రజల కంటే ఫార్మా కంపెనీ ముఖ్యమా అని ప్రశ్నించారు. రేవంత్ కొడంగల్ వాసి కాదు.. వలస వచ్చారని అన్నారు.

## ప్రివిలేజ్ మోషన్ వేస్తాం : ఈటల రాజేందర్

కాంగ్రెస్ వాళ్లే ఈ దాడులు చేయించారని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘటనపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ వేస్తామన్నారు. బడా కంపెనీలకు భూములు అప్పజెప్పడం వెనుక మతలబేంటి అని ప్రశ్నించారు. రియల్‌ఎస్టేట్ కోసం భూములు ఇస్తే ఊరుకోం అని హెచ్చరించారు.



సీఎం రేవంత్.. మీరు

# ఇటలీకి గులాం?

**ఇటలీ నుంచి వచ్చిన నాయకురాలికి గులాం**
**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శ**
**నన్ను గుజరాత్ కు గులాం అన్నారు..**
**తెలంగాణను రక్షించిన గుజరాత్ బిడ్డ సర్దార్ వల్లభాయ్ పటేల్**
**కచ్చితంగా నేను గుజరాత్ కు గులాంనే**



హైదరాబాద్ : బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో కాంగ్రెస్ పాలన కూడా అలాగే ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఏ మాత్రం మార్పు రాలేదని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదన్నారు. వ్యక్తులను విమర్శించడమే రాజకీయంగా మారిపోయిందని వెల్లడించారు. ఈ రెండు పార్టీల వల్ల రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ సుద్దపూస అయినట్టు ఇప్పుడు మాట్లాడుతోందని విమర్శించారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. కిషన్ గుజరాత్ గులాం అని అన్నారు.. నేను ఎవరికీ గులాంను కాదు భారతీయులకే గులాం అని అన్నారు.. మీరు ఇటలీకి గులాం.. ఇటలీ నుంచి వచ్చిన రాజకీయ నాయకురాలికి గులాం అని అన్నారు. నేను నా తెలంగాణను రక్షించినటువంటి సర్దార్ వల్లభాయ్ పటేల్ గుజరాత్ బిడ్డ .. కచ్చితంగా నేను గుజరాత్ కు గులాం అని సీఎం ఈ విషయం గుర్తుంచుకోవాలని అన్నారు.

హైదరాబాద్‌లో

# ఐటీ దాడులు

హైదరాబాద్ : హైదరాబాద్ లోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో ఐటీ అధికారులు సోమవారం ఉదయం నగరంలో మూడుచోట్ల ఏకకాలంలో రెయిడ్స్ చేశారు. సిటీకి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ స్వస్తిక్ గ్రూప్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. షాద్ నగర్ ప్రాంతంలో రూ.300 కోట్ల విలువైన భూమిని మల్టీ నేషనల్ కంపెనీకి అమ్మింది. అయితే, ఈ లావాదేవీకి సంబంధించిన సొమ్మును స్వస్తిక్ గ్రూప్ తన బ్యాలెన్స్ షీట్ లో చూపించలేదు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఐటీ అధికారులు తాజాగా స్వస్తిక్ గ్రూప్ యజమానులు కల్పన రాజేంద్ర, లక్ష్మణ్ ల నివాసాలతో పాటు షాద్ నగర్, చేవెళ్ల, బంజారాహిల్స్ లోని ఇళ్లు, ఆఫీసులలో తనిఖీలు చేపట్టారు.




# ఆర్జీవీకి చుక్కెదురు

**కేసు కొట్టేయాలంటూ హైకోర్టులో పిటిషన్**
**అరెస్టు ఆపలేమన్న న్యాయస్థానం**
**చంద్రబాబు, పవన్ లను కించపరిచేలా అప్పుడు పోస్టులు**
**రేపు పోలీసు విచారణకు రాంగోపాల్ వర్మ**
**ఇటీవల నోటీసులు అందజేసిన ఒంగోలు పోలీసులు**

అమరావతి : ప్రముఖ సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ వర్మ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. గత ఎన్నికలకు ముందు 'వ్యూహం' చిత్రాన్ని రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించారు. అప్పుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ లను కించపరిచేలా వర్మ సోషల్ మీడియాలో ఎన్నో పోస్టులు పెట్టారు. సినిమాలో సైతం వీరిని కించపరిచే పలు సన్నివేశాలు ఉన్నాయి. ఆయన పై ఉమ్మడి ప్రకాశం జిల్లా మద్దిపాడుకు చెందిన టీడీపీ నేత రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమ విచారణకు హాజరుకావాలంటూ హైదరాబాద్ లో ఉన్న వర్మకు ఏపీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. నోటీసుల ప్రకారం రేపు పోలీసు విచారణకు వర్మ హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. అరెస్ట్ నుంచి తనకు రక్షణ కల్పించాలని, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిటిషన్ ను ఈరోజు హైకోర్టు విచారించింది. అరెస్ట్ నుంచి తాము రక్షించలేమని వర్మ న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది.

